# ఎట్లున్న మేడిగడ్డ ఎట్లయిపాయె!

- మేడిగడ్డ బరాజ్‌కు పర్యాటకుల తాకిడి
- ఎడారిగా మారిన బరాజ్‌ని చూసి నీళ్లు లేక ఆవేదన

మహదేవపూర్, ఫిబ్రవరి 7 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని అంబటిపల్లిలో ఉన్న మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌కు శుక్రవారం పర్యాటకుల తాకిడి పెరిగింది. హైదరాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి , నల్గొండ, ఖమ్మంతో పాటు పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు మేడిగడ్డ బరాజ్‌ను వీక్షించారు. గతంలో జలకళను సంతరించుకున్న బరాజ్ ప్రస్తుతం నీరు లేక ఎడారిని తలపిస్తున్న తీరును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. నాడు కేసీఆర్ ముందు చూపుతో తాగు, సాగు నీరుకు రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మించిన మేడిగడ్డ బరాజ్ నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమని చెప్పారు. బరాజ్‌లో ఏర్పడ్డ చిన్న కుంగుబాటును సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్ట్‌నే నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రైతుల సాగు కష్టాలను తీర్చేందుకు కోట్ల నిధులు ఖర్చు చేసి కట్టిన బరాజ్‌పై కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు చేసి పనిరాకుండా చేసిందని ఆరోపించారు. నాడు ఎండాకాలంలో సైతం రాష్ట్ర రైతాంగానికి సాగు నీరందించిన మేడిగడ్డ నేడు రాజకీయాలకు బలికావడం చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలోనే అద్భుతమైన ప్రాజెక్ట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేశారని మండిపడ్డారు. బరాజ్ వద్ద చూస్తే నష్టం ఏమీ జరిగినట్టు లేదన్నారు. మరమ్మతు చేస్తే తాగు, సాగు నీటి కష్టాలు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని పర్యాటకులు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే కాళేశ్వరం ప్రాజెక్ట్ కళకళలాడి ప్రజలు, రైతులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌ను వీక్షిస్తున్న పర్యాటకులు

## కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్ట

- వందల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ ఘటనలు
- ఇంత జరుగుతున్నా గురుకులాలను పట్టించుకోరా?
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- దామరవంచ హాస్టల్ ఘటనపై ఆవేదన



హైదరాబాద్, ఫిబ్రవరి7(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి, విద్యార్థులు దవాఖాన పాలుకావడం సర్కారు నిర్లక్ష్యానికి పరాకాష్ట అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో వందల్లో సంఖ్య లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని శుక్రవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. వందల మంది విద్యార్థులు దవాఖానల పాలు కాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం ప్రకటించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని, రేవంత్ మాటలు కోటలు దాటితే, ఆచరణ గడప దాటదు అనేందుకు గురుకులాల దీనస్థితే నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆందోళన

తమను అన్యాయంగా ఫెయిల్ చేశారంటూ సీవోఈ ఎదుట ధర్నా

బాసర, ఫిబ్రవరి 7: తమను అన్యాయంగా ఫెయిల్ చేశారంటూ శుక్రవారం నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ (సీవోఈ) ఆఫీసు ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. మూల్యాంకనంలో కోడింగ్, డీకోడింగ్ వల్ల తమకు అన్యాయం జరిగిందని, వాస్తవానికి తాము ఉత్తీర్ణులయ్యామని చెప్పారు. తమకు న్యాయం జరగకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ గోవర్ధన్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేసినా స్పందించలేదు. నిజనిర్ధారణ కమిటీ వేసినట్టు సమాచారం.

# వైకుంఠధామాలుగా గురుకులాలు?

- ఇది సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకమే
- సైన్యంలోకి వెళ్తానన్న ఆరాధ్యను కాటికి పంపిన పాపం కాంగ్రెస్‌దే
- ఏడాది పాలనలో 56 మంది మృతి
- బాలల్ని బలిగొన్న సీఎంపై కేసు పెట్టాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్పీ
- 5 కోట్ల పరిహారం ఇవ్వాలి: జైపాల్
- ఆరాధ్య కుటుంబానికి పరామర్శ



మాట్లాడుతున్న ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్, శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, ఫిబ్రవరి 7: రాష్ట్రంలోని గురుకులాలను వైకుంఠధామాలుగా మార్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని గురుకులాలను మృత్యుకుహారాలుగా మార్చారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామంలో ఉన్న బాలానగర్ గురుకులం మృతురాలు విద్యార్థిని ఆరాధ్య కుటుంబాన్ని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ విజితారెడ్డితో కలిసి ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సైన్యంలోకి వెళ్తానన్న విద్యార్థిని ఆరాధ్యను కాటికి పంపిన పాపం కాంగ్రెస్ సర్కార్‌దేనని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రాష్ట్రం లో 56 మంది గురుకుల విద్యార్థులు మృతి చెందారని, దీనికి విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని ఆరాధ్య మృతిపై అనుమానం ఉన్నదని, ఎలా? ఎందుకు? మృతి చెందిందన్న విషయాన్ని ప్రభుత్వం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గురుకుల విద్యార్థులు ప్రాణాలు వదులుతున్నారని ధ్వజమెత్తారు. ఆరాధ్య కుటుంబానికి రూ.5 కోట్ల పరిహారం, డబుల్ బెడ్రూం ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆరాధ్య కుటుంబానికి ఆర్ఎస్పీ రూ.51 వేలు, జైపాల్‌యాదవ్ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములమ్మ, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్, యాదగిరి, ఆనంద్, ప్రసాద్, శేఖర్, రమేశ్, రవి, జంగయ్య తదితరులు ఉన్నారు.

# బుల్డోజర్లపై ఉన్న ప్రేమ బడి పిల్లలపై లేదా?

- పేద పిల్లలకు బువ్వ పెట్టరా?
- ఇది ప్రజాపాలన కాదు.. వేధించే పాలన
- మధ్యాహ్న భోజన పథకంపై దృష్టిపెట్టండి
- బాధ్యతలేని సర్కార్ వల్లే రైతు ఆత్మహత్యలు
- రుణమాఫీ ఆగం.. పెట్టుబడిసాయం మాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): పేదల ఇండ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా? అని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను వేధించే పాలన అని ఎద్దేవాచేశారు. అమృత్ స్కీంను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి పసిపిల్లల కడుపు నింపడంలో లేదా? అని శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'అదానీకి రాష్ట్రంలోని వనరులను దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా? మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంపై ఉన్న ప్రేమ.. భవిష్యత్తు భారతావని పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?' అని నిలదీశారు. 'మంత్రుల సంగతి దేవుడెరుగు.. ముఖ్యమంత్రి ఇలాకాలోనే బడి పిల్లలు పస్తులుండే దుస్థితి దాపురించింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బాసులు, గల్లీ దోస్తుల ఆకలి తీర్చడమే కాదు.. మధ్యాహ్న భోజనంపై దృష్టి పెట్టాలి' అని డిమాండ్ చేశారు. 'ఫొటోలకు పోజులిచ్చి ఒక్క పూటకు గప్పాలు కొట్టడం కాదు.. నిత్యం విద్యార్థులకు సకాలంలో అన్నం అందుతున్నదో లేదో సమీక్షించుకోవాలి' అని సూచించారు.

### పల్లె మళ్లీ కన్నీరు

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రుణమాఫీని ఆగంచేసి పెట్టుబడి సాయానికి మాయం చేస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రైతు ఆత్మహత్యలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు రైతుల పాలిట శాపంగా మారిందని, చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్లే తెలంగాణ పల్లె మళ్లీ కన్నీరు పెడుతున్నదని, రైతుల మరణమృదంగం మళ్లీ మోగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ సర్కార్‌కు చేతనైతే సాగు సంక్షోభాన్ని ఆపి అన్నదాతల ఆత్మహత్యలను నిలువరించాలని డిమాండ్ చేశారు. '420 అబద్ధపు హామీల పాపం..420 రోజుల చేతకాని పాలన శాపం.. ఫలితంగా మాటలకందని మహావిషాదం. తెలంగాణ చెల్లించిన భారీ మూల్యం.. 420 మంది రైతన్నల బలవన్మరణం' అని ఆవేదన వ్యక్తం చేశారు. అసమర్థులు అధికార పీఠమెక్కి అన్నదాతలను బలిపీఠం ఎక్కిస్తున్నారని విమర్శించారు. దేశానికే వెన్నెముకైన రైతులకు కాంగ్రెస్ పాలనలో వరుస వెన్నుపోట్లు అని మండిపడ్డారు. పదేండ్లలో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి చేరిన తెలంగాణ రైతన్నకు ఇప్పుడు పెట్టుబడి ఎండమావిగా మారిందని వాపోయారు.

# గురుకుల పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

**మహబూబాబాద్ జిల్లాలో ఘటన**



గూడూరు పీహెచ్‌సీలో విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కవిత

గూడూరు, ఫిబ్రవరి 7 : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గిరిజన గురుకుల పాఠశాలలో 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో నలుగురు విద్యార్థులు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. 9వ తరగతిసాయిప్రసాద్, 7వ తరగతిలాకవత్ రాహుల్, బానోత్ అనిల్, బానోత్ యాకూబ్ గురువారం సాయంత్రం హాస్టల్‌లో ఇచ్చిన స్నాక్స్ (బొబ్బర గుగ్గిల్లు) తిన్నారు. రాత్రి భోజనంలో కర్రీ, సాంబారుతో అన్నం తిని పడుకున్నారు. రాహుల్, సాయిప్రసాద్‌కు రాత్రి నుంచి విరోచనాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారే సరికి నీరసించిపడిపోవడంతో గమనించిన తెలుగు ఉపాధ్యాయుడు సీహెచ్‌సీకు శుక్రవారం తీసుకెళ్లి చికిత్స చేయించాడు. మరోగంట అనంతరం అనిల్, యాకూబ్ కూడా విరోచనాలు కావడంతో దవాఖానకు తరలించారు. మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఆశ్రమ పాఠశాలను సందర్శించి, నలుగురికి మాత్రమే విరోచనాలు అవుతున్నాయని తెలిపారు. విద్యార్థులను ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు.

## పీజీ సెమిస్టర్స్ పరీక్షల వాయిదాకు విద్యార్థుల ధర్నా

సికింద్రాబాద్, ఫిబ్రవరి7: ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాంకాలేజ్, సైఫాబాద్ పీజీ కాలేజ్, సికింద్రాబాద్ కాలేజ్ సైన్సు విద్యార్థులు శుక్రవారం ఓయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల సమయంలో పలు పరీక్షలు సైతం ఉండటంతో వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సిలబస్ కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. అయితే దీనిపై సదరు కళాశాలల ప్రిన్సిపాల్స్ మాత్రం సిలబస్ పూర్తి అయిందని పేర్కొంటున్నారు. వేలాదిమంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, వాయిదా వేసే అవకాశాలు లేవని ఓయూ అధికారులు చెబుతున్నారు.



కేటీఆర్ పంపించిన ఆర్థిక సహాయాన్ని అరవింద్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్న వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# అరవింద్ కుటుంబానికి అండగా కేటీఆర్

ఎక్స్ వేదికగా తెలిసిన వెంటనే రూ. 50వేల ఆర్థిక సాయం

వరంగల్, ఫిబ్రవరి 7 : రెండు రోజుల కిత్రం రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరకాలకు చెందిన అరవింద్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. అరవింద్ గురువారం శాతవాహన ఎక్స్‌ప్రెస్ నుంచి కేసముద్రం సమీపంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో రెండు కాళ్లు విరిగాయి. అరవింద్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులు ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకవెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ద్వారా అరవింద్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. నగరంలోని గార్డియన్ దవాఖానలో చికిత్స పొందుతున్న అరవింద్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నరేందర్, కేటీఆర్ పంపించిన రూ.50వేలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఆర్థిక సహాయాన్ని అందజేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# 13న ఆమనగల్లులో రైతు దీక్ష

**హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

వెల్దండ, ఫిబ్రవరి 7 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమన్‌గల్లులో ఈ నెల 13న 15వేల మందితో రైతు దీక్ష చేపడుతున్న కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 13న రైతు దీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వరంగల్‌లో డీటీసీ శ్రీనివాస్ నివాసంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

# డీటీసీ అక్రమాస్తులు 50 కోట్లు!

- హనుమకొండ డీటీసీ ఇంట్లో ఏసీబీ సోదాలు
- బంధువుల ఇండ్లలోనూ తనిఖీలు

హైదరాబాద్, జగిత్యాల, సుబేదారి, ఫిబ్రవరి 7 (నమస్తేతెలంగాణ): హన్మకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ ఇంటిలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అక్రమాస్తులు కలిగి ఉన్నారని గత కొంతకాలంగా ఆయనపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని శ్రీనివాస్ ఇంటితోపాటు వరంగల్, కరీంనగర్, జగిత్యాల తదితర ప్రాంతాల్లోని బంధువుల ఇండ్లలోనూ సోదాలు జరిపారు. మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లో విలాసవంతమైన ఇల్లు, జగిత్యాల, కరీంనగర్, వరంగల్‌లో భూములు, బ్యాంకు అకౌంట్లలో నగదు, విలువైన బంగారు ఆభరణాలను గుర్తించారు. అక్రమాస్తులు రూ.50 కోట్లకుపైగానే ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. పూర్తి లెక్కలు తేలితే ఆస్తుల విలువ మరింత పెరుగొచ్చు. సోదాలకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## ఉన్నది 21 గుంటలు.. పడ్డది 12గుంటలకు

పాలకుర్తి, ఫిబ్రవరి 7 : జనగామ జిల్లా పాలకుర్తిలోని రైతుకు తన పేరు మీద 21 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా మాత్రం 12 గుంటలకే పడ్డాయి. దీంతో కంగుతిన్న రైతు తనకున్న ది 21 గుంటల భూమి అయితే 12గుంటల భూమికి మాత్రమే డబ్బులు పడడమేంటని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీయగా తమకు తెలియదని ప్రభుత్వమే 12 గుంటల భూమికి వేసిందని సమాధానం ఇచ్చారు.

## జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీపై ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి7 (నమస్తే తెలంగాణ): గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మెంబర్ సెక్రటరీ అజగేశన్‌పై బోర్డులోని ఉద్యోగులు మరోసారి కేంద్రానికి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఉద్యోగులను మానసికంగా వేధించడమేకాకుండా.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని బోర్డు ఉద్యోగులు ఆది నుంచీ ఆరోపిస్తున్నారు.

# మదర్ డెయిరీ ఆస్తులు అమ్మేస్తం

- బ్యాంకుల అప్పులతోపాటు రైతుల బకాయిలు చెల్లిస్తం
- నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి
- పాలకవర్గం ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం





సమావేశంలో మాట్లాడుతున్న నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 7 : బ్యాంకుల అప్పులు తీర్చేందుకు, రైతులకు బకాయిలు చెల్లించేందుకే మదర్ డెయిరీ సంస్థ స్థిరాస్తులు విక్రయించేందుకు పాలకవర్గం నిర్ణయించినట్టు నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయ ఆవరణలో పాలకవర్గ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో పోటీ, కరోనా, ఇతరత్రా యాజమాన్య నిర్ణయాలతో సంస్థ రూ.60 కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. సంస్థ లాభాల్లో ఉన్నట్టు చూపి బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని, ప్రస్తుతం నష్టాల్లో ఉన్నట్టు బ్యాంకులు గుర్తిస్తే మార్టిగేజ్ చేసుకున్న నికర ఆస్తులను వేలం వేసే ప్రమాదముందని చెప్పారు. అప్పుల నుంచి సంస్థ బయటపడేందుకు తప్పని పరిస్థితుల్లో మార్టిగేజ్ చేసిన చిట్యాలలోని 29.36 ఎకరాల భూమితోపాటు నకిరేకల్, చండూరులోని స్థలాలను విక్రయించి వచ్చిన డబ్బుతో అప్పులు, బకాయిల చెల్లింపుతో పాటు సంస్థకు అవసరమైన మిషనరీలు కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. సంస్థ మనుగడ కోసం తీసుకున్న నిర్ణయాలకు మద్దతు తెలుపాలని మాజీ చైర్మన్లు, మాజీ డైరెక్టర్లు, సొసైటీల అధ్యక్షులను కోరారు.

**దిద్దుబాటు చర్యలు చేపట్టాలి : జితేందర్‌రెడ్డి**

ఢిల్లీ వారితో పాల విక్రయ ఒప్పందం రద్దు, కరోనా కారణంగానే సంస్థ లాభాల నుంచి నష్టాల బాటలోకి వెళ్లిందని మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి తెలిపారు. మార్కెట్‌లో పోటీ కారణంగా విక్రయాలు తగ్గడంతోపాటు నష్టాలు పెరుగుతూ వచ్చాయని చెప్పారు. స్థిరాస్థి విక్రయాలకు బదులుగా దిద్దుబాటు చర్యలు చేపట్టి సంస్థను గాడిన పెట్టాలని సూచించారు. మాజీ డైరెక్టర్ సోమిరెడ్డి మాట్లాడుతూ సంస్థ లాభనష్టాలకు పాలకవర్గమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థిరాస్తుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. సమావేశంలో మాజీ చైర్మన్లు లింగాల శ్రీకర్‌రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బెలిదె కృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక

**కౌలురైతు ఆత్మహత్య**



జమ్మికుంట, ఫిబ్రవరి 7 : దిగుబడి రాక .. పెట్టుబడి అప్పులు తీర్చలేకపోతున్నాననే మనస్తాపంతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. విలాసాగర్‌కు చెందిన నెల్లి శంకరయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. పెద్ద కొడుకుకు దివ్యాంగుడు. శంకరయ్య గ్రామంలో 5 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత పత్తి, మరికొంత వరి సాగు చేస్తున్నాడు. సాగు కోసం రూ.5 లక్షల వరకు అప్పుచేశాడు. పంట దిగుబడి రాక అప్పులు పెరిగి పోవడంతో మనస్తాపం చెందిన శంకరయ్య శుక్రవారం పొలం వద్ద పురుగుల మందుతాగాడు.

# దివాలాకోరు ఎత్తుగడ

మొదటిపేజీ తరువాయి...

ఎక్కడో కాదు.. గురువారం నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సుదీర్ఘంగా ఎమ్మెల్యేలకు వివరించారు. 'ఖజానాలో నిధులు లేవు.. మీకు పనులు మంజూరు చేయలేం' అని తేల్చి చెప్పినట్టు సమాచారం. పైగా.. మంత్రులు చెప్తే నమ్మరనే ఉద్దేశంతో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను పిలిపించుకొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మొత్తంగా 'పనులు చేయలేం.. పైసలు ఇవ్వలేం' అని ఎమ్మెల్యేలకు ప్రభుత్వం స్పష్టత ఇచ్చినట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.

### శాపంగా మారిన 'దివాలా' ప్రచారం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం ప్రారంభించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రాష్ట్రం దివాలా తీసిందన్న ప్రచారం చేయాలని ఎత్తుగడ వేసింది. అందులో భాగంగానే శ్వేతపత్రం విడుదల చేసింది. తాము అధికారం చేపట్టాక చేసిన అప్పులను, తెలంగాణ ఏర్పడకముందే ఉన్న అప్పులను కూడా కేసీఆర్ సర్కారు ఖాతాలో వేసింది. ఈ దివాలాకోరు ఎత్తుగడతో పెట్టుబడిదారులు, బడా వ్యాపారులు రాష్ట్రంవైపు చూడటం మానేశారు. కొత్త పెట్టుబడుల రాక దాదాపు నిలిచిపోయింది. బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏటా దాదాపు రూ.14వేల కోట్ల ఆదాయం పెరుగుతూ రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఆదాయం పెరుగకపోగా.. వచ్చే దాంట్లోనే దాదాపు రూ.16వేల కోట్ల వరకు ఆదాయం తగ్గిపోయినట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు ఎత్తుకున్న దివాలా ప్రచారం చివరికి నిజంగానే రాష్ట్రాన్ని దివాలాతీసే దిశగా పాలన సాగుతున్నదని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### పరువు పోతున్నది

మనం బాగున్నామని చెప్తేనే ఎవరైనా మనల్ని నమ్ముతారు.. అలా కాకుండా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయామని చెప్తే ఎవరూ నమ్మరు. కాస్త ఇంగిత జ్ఞానం ఉన్న ఎవరికైనా ఈ విషయం అర్థం అవుతుంది. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర పరువు తీస్తున్నదని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'రాష్ట్రం అప్పుల కుప్ప అయ్యింది' అంటూ కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అనేకమార్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని ప్రచారం చేశారు. 'లంకెబిందెలు ఉన్నాయని వస్తే ఖాళీ కుండలు ఉన్నాయి, రాష్ట్రాన్ని పీకల్లోతు అప్పుల్లో ముంచారు, ప్రతి నెల వచ్చే ఆదాయం సరిపోవడం లేదు.. మళ్లీ అప్పు చేయాల్సి వస్తున్నది' అంటూ తరుచూ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందనే స్థాయిలో ప్రభుత్వం ప్రచారం చేసింది. రాజకీయ కక్షతో చేసిన ఈ ప్రచారం రాష్ట్రానికే శాపంగా మారిందని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడిదారులకు రాష్ట్రంపై నమ్మకం పోయిందని, ఫలితంగా ఆదాయం పడిపోయిందని చెప్తున్నారు. పైగా 14 నెలల కాలంలోనే వివిధ మార్గాల ద్వారా ఏకంగా రూ.1.46 లక్షల కోట్ల అప్పులు చేశారని, వీటితో సంపదను సృష్టించడంలోనూ ప్రభుత్వం విఫలం అయ్యిందని విమర్శిస్తున్నారు. అటు గ్యారెంటీలను అమలు చేయలేకపోతున్నామని, ఇటు చెప్పుకోవడానికి కొత్తగా ప్రాజెక్టులేమీ చేపట్టలేదని వాపోతున్నారు. 'తెలంగాణ ఏర్పడిన కొత్తలో రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రం అని పదేపదే ప్రచారం చేశాం. దీంతో అందరిలో నమ్మకం పెరిగింది. పదేండ్ల పాలనలో దానిని నిజం చేసి చూపించాం' అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నిపుణులు ఉదాహరిస్తున్నారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా పేర్కొనడంతో పెట్టుబడిదారులు, బడా వ్యాపారవేత్తలు తెలంగాణపై ఆసక్తి చూపారని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా రాష్ట్రం దివాళా తీసిందని చెప్తుండటం శాపంగా మారిందని అంటున్నారు.

### ఏడాదిలోనే రూ.30వేల కోట్ల నష్టం..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం ఏటికేడు పెరిగింది. 2015 నుంచి లెక్కిస్తే.. 2023 నాటికి సగటున ప్రతి సంవత్సరం రూ.14వేల కోట్ల ఆదాయం పెరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఒక్క కరోనా కాలంలో మాత్రమే రూ.2వేల కోట్లు లోటు నమోదైంది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయం పెరగకపోగా, తగ్గిపోయిందని గణాంకాలు చెప్తున్నాయి. ప్రభుత్వం స్వయంగా కాగ్‌కు సమర్పించిన నివేదికలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2023–24తో పోల్చితే 2024–25 డిసెంబర్ నాటికి రెవెన్యూ వసూళ్లు రూ.12వేల కోట్లు తక్కువగా నమోదైనట్టు కాగ్ నివేదిక స్పష్టంచేసింది. అంటే ప్రతి త్రైమాసికానికి సగటున రూ.4వేల కోట్ల చొప్పున నష్టపోయిందన్నమాట. ఈ లెక్కన చివరి త్రైమాసికం కూడా గణిస్తే రూ.16 వేల కోట్ల వరకు లోటు తప్పదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంటే.. ఏటా పెరగాల్సిన రూ.14వేల కోట్లు రాకపోగా, రావాల్సిన ఆదాయంలోనే రూ.16వేల కోట్లు రాష్ట్రం నష్టపోయిందని చెప్తున్నారు. దీనిని బట్టి ఏడాది కాలంలోనే ఏకంగా రూ.30 వేల కోట్లు నష్టపోయామని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. 'రాజకీయం కోసం రాష్ట్రం పరువు తీయొద్దు. రాష్ట్రం అప్పుల కుప్ప అంటూ ప్రచారం చేసి ఒక బీమారీ రాష్ట్రంగా చూపించొద్దు. ప్రపంచానికి రాష్ట్రంపై తప్పుడు మెసేజ్ వెళ్తే తీరని నష్టం చేస్తుంది' అని 2023 డిసెంబర్ 20న అసెంబ్లీలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు. కేసీఆర్, అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు నిజమని గణాంకాలతో వెల్లడైందని అంటున్నారు.

### హెచ్చులకు పోయి.. తప్పుడు నిర్ణయాలు

కేసీఆర్‌పై కక్షతో చేసిన తప్పుడు ప్రచారానికి తోడు.. రాజకీయంగా స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం ఆర్థికరంగంపై పిడుగుపాటుగా మారిందని కాంగ్రెస్ సీనియర్లు వాపోతున్నారట. ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ విషయంలో హెచ్చులకు పోయి తీసుకున్న తప్పుడు నిర్ణయాలు భస్మాసుర హస్తంగా పరిణమించాయని సీనియర్లు చర్చించుకుంటున్నారట. రుణమాఫీ చేసే పరిస్థితి లేదని ఆర్థిక శాఖ అధికారులు మొత్తుకుంటున్నా, దానికి బదులు రైతు భరోసా ఇవ్వాలని ఆర్థిక నిపుణులు సూచించినా చెవిన పెట్టలేదని వాపోతున్నారట. హరీశ్‌రావు చేసిన సవాల్‌పై తాను నెగ్గానని గప్పాలు కొట్టుకోవడం కోసం ప్రభుత్వ ఆదాయం, అప్పోసొప్పో చేసిన డబ్బు.. ఇలా మొత్తం నిధులను రుణమాఫీకి కేటాయించారని చెప్తున్నారు. అయినా సరిపోక అరకొరగానే రుణమాఫీ అయ్యిందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉంటుందోనని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. రెండు మూడు నెలల తర్వాత జీతాలు ఇచ్చే పరిస్థితి ఉంటుందా? అని ఉద్యోగ వర్గాల్లోనూ చర్చ జరుగుతున్నదని సమాచారం.

### అడ్మినిస్ట్రేషన్‌పై శ్రద్ధ లేదు..

ప్రభుత్వంలోని పెద్దలకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ, పాలనపై లేదనే విమర్శలు కాంగ్రెస్ వైపు నుంచి వినిపిస్తున్నాయి. మంత్రుల్లో అత్యధిక శాతం మంది రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పట్టింపు లేనట్టుగా ఉంటున్నారని సమాచారం. పాలకులే ఇలా నిర్లక్ష్యంగా ఉంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 'దివాళా' పాట మానకపోతే మరిన్ని కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.